సాక్షి చిత్తూరు

మంగళవారం। 23। సెప్టెంబర్। 2025



అమ్మా..గంగమ్మా!
శరన్నవరాత్రి దసరా మహోత్సవాలకు బోయకొండ గంగమ్మ ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. - IIలో



సంఘమిత్ర చేతివాటం
వెదురుకుప్పం మండలంలో ఓ సంఘమిత్ర చేతివాటాన్ని ప్రదర్శించారు. రూ.4 లక్షలకుపైగా స్వాహా చేశాడు. - IIలో



పంటలు ధ్వంసం
పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగ నంటున్నాయి. నిత్యం ఏదో ఒక గ్రామంలో పంటలను ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. - IIలో

న్యూస్‌రీల్

డిప్యుటేషన్‌పై వైద్య సిబ్బంది

పెనుమూరు(కార్వేటినగరం): సక్రమంగా విధులు నిర్వర్తించని పెనుమూరు సీహెచ్‌సీ వైద్యసిబ్బందిని కుప్పం ఏరియా ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు సమాచారం. ఈ నెల 18వ తేదీ పెనుమూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారులు డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, డాక్టర్ గీతాకుమారిని కలెక్టర్‌కు సరెండర్ చేశారు. రేడియోగ్రాఫర్ గీతాకుమారిని డిప్యూటేషన్‌పై కుప్పం ఏరియా ఆస్పత్రికి బదిలీ చేసినట్లు తెలిసింది.

టీబీని తరిమికొట్టాలి



క్షయ వ్యాధి గ్రస్తులకు ఆహార పదార్థాలు అందజేస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : టీబీ వ్యాధిని తమిరికొట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా 100 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షయా వ్యాధి పట్ల క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న జీవన విధానం, తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తి కారణంగా కొన్నేళ్లుగా పిల్లలు సైతం క్షయ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. అప్రమత్తతతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నివారణ సాధ్యమేనన్నారు. క్షయ నిర్మూలనకు నిక్షయ్ సంపర్క్ హెల్ప్‌లైన్ 1800–11–6666 టోల్ ఫ్రీ నెంబర్‌లలో సంప్రదించాలన్నారు. జేసీ విద్యాధరి, డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు అందజేసే అర్జీలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. పీజీఆర్‌ఎస్‌లో ప్రతి వారం 200 నుంచి 300 అర్జీలు నమోదవుతున్నాయని, అధిక శాతం అర్జీలు నమోదవుతున్న శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గత ఏడాది జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 63,063 అర్జీలు నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని శాఖల్లో కచ్చితంగా ఈ ఆఫీస్ అమలు చేయాలన్నారు. మాన్యువల్ విధానంలో ఫైల్స్ పంపకూడదన్నారు. ప్రతి కార్యాలయంలో ఉద్యోగులు ఎన్ని ఫైల్స్ పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను నివేదికల రూపంలో సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు త్వరలో రూ.157 కోట్లు సబ్సిడీ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

24న తిరుపతికి చేరుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 24న తిరుపతిలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీలో ఎంపికై కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు ఈ నెల 24న తిరుపతిలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాలకు ఉదయం 7 గంటలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సౌకర్యార్థం బ్లాంకెట్స్, తలదిండు, గొడుగులు తీసుకొచ్చుకోవాలన్నారు. చేరుకునే అభ్యర్థులను రిపోర్టు చేసుకున్న జాబితా ప్రకారం ఈ నెల 25న విజయవాడలో జరిగే కార్యక్రమానికి ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. అభ్యర్థులు తమ ఫొటోతో పాటు విచ్చేసే అభ్యర్థుల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఐడీ కార్డును తీసుకురావాలన్నారు. తిరుపతి నుంచి ప్రత్యేక బస్సుల్లో అభ్యర్థులను విజయవాడకు తరలిస్తామని ఆమె వెల్లడించారు.

సైబర్ వల.. అంతా విలవిల!

• తమ కంపెనీకి రోజూ 5 స్టార్ రేటింగ్ ఇస్తే.. రోజూ రెండు కాయిన్ల చొప్పున నెలకు 60 కాయిన్లు ఇస్తామని, ఈ–మెయిల్ ఐడీ వేరుగా ఉండాలని చెప్పి ఓ మహిళకు ఆన్‌లైన్‌లో ఆఫర్ వచ్చింది. తీరా 600 కాయిన్లు గెలుచుకున్న తనకు రూ.60 వేలు ఇవ్వాలని మహిళ కోరగా, తొలుత రూ.5 వేలు చెల్లించాలని చెప్పారు. ఇలా క్రమంగా ఆమె నుంచి రూ.3.75 లక్షలు కాజేయగా తాలూకా పోలీసులను ఆశ్రయించారు.

• చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేసే ఓ ఉద్యోగికి ప్రధాన మంత్రి కిసాన్ యోజన పేరిట ఏపీకే ఫైల్ వాట్సాప్‌కు వచ్చింది. దీన్ని నలుగురికి ఫార్వర్డ్ చేస్తే, బహుమతి వస్తుందని మెసేజ్‌లో ఉంది. తీరా ఫైల్ ఓపెన్‌చేస్తే, ఫోన్‌పేలో ఉన్న రూ.1.3 లక్షలు పోగొట్టుకోవడంతో పాటు ఫోన్ హ్యాక్‌కు గురైంది.

• కుప్పంకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి 'తల్లికి వందనం' డబ్బులు ఇంట్లో పిల్లలందరికీ రావాలంటే కింది లింకుపై క్లిక్ చేయమని టెక్స్ట్ మెసేజ్ వస్తే అలాగే చేశాడు. తీరా తన యూపీఐ ఖాతాలో ఉన్న రూ.32 వేలు పోగొట్టుకున్నాడు.

• ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ర్యాంకు తెలుసుకోవాలంటే ఫైల్ ఓపెన్ చేయమని వచ్చిన మెసేజ్‌ను తెరిస్తే.. వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ నగరికి చెందిన విద్యావంతుడు రూ.12 వేలు పోగొట్టుకున్నాడు.



...
పై ఘటనలు మచ్చుకు కొన్ని మాత్రమే. జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరగాళ్ల మోసాలకు పలువురు బలైపోతున్నారు. బయటకు చెప్పుకోలేక కొంతమంది నలిగిపోతున్నారు. వీటి కట్టడికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. నగదు రికవరీలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ఒక్క నిమిషం ఆలోచిస్తే ఇలాంటి మోసాలకు తావుండదని పోలీసులు సూచిస్తున్నారు.

- ఆధునిక పోకడలో నేరగాళ్ల సరికొత్త పంథా
- ప్రజల ఏమరుపాటుకు సాంకేతికత జోడించి వల
- నిముషాల్లో రూ.లక్షలు కోల్పోతున్న బాధితులు
- సరికొత్త సవాళ్లలోనూ.. నేరస్తుల కోసం ఖాకీల వేట
- నిందితులను పట్టుకున్నా.. రికవరీలో ఇబ్బందులు

చిత్తూరు అర్బన్: ఇప్పుడంతా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) యుగం. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి. ఆన్‌లైన్‌లో ఆర్థిక నేరాలు చేసేవాళ్లు సైతం ఏఐని ఉపయోగించి సరికొత్త మోసాలకు పాల్పడుతూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. మోసం చేసిన వ్యక్తి ఎవరో తెలియదు. ఎక్కడ ఉంటాడో చెప్పలేని పరిస్థితి. ఆడ, మగా కూడా గుర్తించడం వీలుకాదు. కానీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.లక్షలకు రూ.లక్షలు కొల్లగొట్టేస్తున్నారు. నిందితులను గుర్తించడం, పట్టుకోవడం, పోగొ ట్టుకున్న నగదును రికవరీ చేయడం పోలీసులకు ఓ సవాలుగా మారుతోంది.

రోజూ కొత్తకొత్త నేరాలు

చిత్తూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు ఇటీవల వస్తున్న సైబర్ మోసాలు చూస్తుంటే పోలీసులే షాక్‌కు గురవుతున్నారు. అడ్డూ అదుపులేని దురాశ, అనవసరమైన వాటిని క్లిక్ చేయడం మోసాలకు ప్రధాన కారణంగా మారుతోందని గ్రహించారు.


మీట నొక్కనంతవరకు సేఫ్

వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్‌ల్లో చాలా వరకు ఏపీకే ఫైల్స్ వస్తుంటాయి. వీటిని ఏ మాత్రం క్లిక్ చేసినా ఖాతాలో డబ్బులు ఖాళీ అవుతాయి. కొందరు లక్కీడిప్‌లో బహుమతి వచ్చిందని సతాయించి డబ్బులు దోచేస్తున్నారు. అనవరసమైన వాటి జోలికి వెళ్లడం, సంబంధంలేని ఫైల్స్‌పై క్లిక్ చేయడమే సైబర్ నేరం జరగడానికి బీజంగా పడుతోంది.

అవమానంగా భావిస్తూ.. ఆర్థికంగా చితికిపోతూ..

నగదు పోగొట్టుకున్న తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని కొందరు మిన్నకుండిపోతున్నారు. కానీ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల పోగొట్టుకున్న నగదు మళ్లీ బ్యాంకు ఖాతాకు తెప్పించడం పోలీసులకే సాధ్యం. సైబర్ మోసగాళ్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను ఛేదిస్తూ, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ జిల్లా పోలీసు యంత్రాంగం అండగా నిలుస్తోంది. గత మూడేళ్లల్లో సైబర్‌క్రైమ్ ద్వారా పోగొట్టుకున్న దాదాపు రూ.2.16 కోట్ల నగదును బ్యాంకుల్లోనే ఫ్రీజ్ చేయగలగడం జిల్లా పోలీసు యంత్రాంగానికే సాధ్యం.

ఒక్క నిమిషం ఆలోచిస్తే



స్మార్ట్ ఫోన్ల వాడకంలో ఏది అవసరం..? ఏది అనవసరం..? అని రెండే ప్రశ్నలు వేసుకుంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసి నట్టే. ఏదో గిఫ్ట్ వచ్చిందని, స్టాక్ మార్కెట్‌లో వారానికి రూ.లక్ష సంపాదించొచ్చని రకరకాలుగా మోసాలు చేస్తున్నారు. ఒక్క నిమిషం మనం ఏం చేస్తున్నామో ఆలోచిస్తే అసలు నేరం జరగదు. సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రతి రోజూ అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. ఒకవేళ ఎవరైనా మోసపోయినా పరువుపోతుందని భయపడొద్దు. వెంటనే సైబర్ హెల్ప్‌లైన్–1930, ఫోన్–9440900005, 9121211100 నెంబర్లకు ఫోన్‌చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి తీసుకు రావడం సాధ్యమవుతుంది.

– తుషార్ డూడీ, ఎస్పీ, చిత్తూరు

ఆలకిస్తూ..భరోసానిస్తూ!



సమస్యలు వింటున్న ఎస్పీ డూడీ

చిత్తూరు అర్బన్: సుదూర ప్రాంతాల నుంచి న్యాయం కోసం వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా విన్నారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? విచారణ నేపథ్యంపై ఆయా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో (ఎస్‌హెచ్‌వో) మాట్లాడి, ప్రజలకు భరోసా ఇచ్చారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి తొలిసారి హాజరైన ఎస్పీ తుషార్ డూడీ.. ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. తన వద్దకు వచ్చిన బాధితులతో ఆయన ఓపిగా మాట్లాడి, న్యాయం చేస్తామన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే ఎస్‌హెచ్‌వోలత మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఒక్క సమస్యపై విచారణ చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 53 ఫిర్యాదులు అందాయి. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర రాజు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

మహిళా సంరక్షణ కార్యదర్శిపై వేటు

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని సీఆర్ కండ్రిగ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి శకుంతలను కలెక్టర్ సుమిత్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సస్పెండ్ ఆర్డర్లు జారీ చేశారు. వివరాలు.. సీఆర్ కండ్రిగ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న శకుంతల రిజిస్టర్‌లో సంతకం చేయక పోవడంతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా నమోదు కాలేదు. విధులకు ఆలస్యంగా హాజరు కావడంపై కారణం అడగ్గా సక్రమంగా సమాధానం చెప్పక పోవడంతో ఎంపీడీవో నీలకంటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన నివేదిక ప్రకారం ఆమెను విధుల నించి తొలగించినట్టు కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలే కీలకం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కమిటీల జాబితాలను అందిస్తున్న వజ్ర భాస్కర్‌రెడ్డి, అనీషారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేస్తూ కార్యకర్తలే కీలకంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పుంగనూరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో సహా అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో కలసి తిరుపతిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరులో వినూత్న పద్ధతిలో వార్డులు, గ్రామాల వారీగా ఇన్‌చార్జ్‌లను, కార్యకర్తలను ఎంపిక చేశారు. వారితో సెల్‌ఫోన్ల ద్వారా పెద్దిరెడ్డి నేరుగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమ కమిటీల ఏర్పాటు డేటాను మండలాల వారీగా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నియంత పోకడలను, అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరితోనూ నేరుగా సంభాషిస్తూ, వారి కష్టసుఖాలను తెలుసుకుని అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు తలొగ్గాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డితో పాటు పార్టీ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు



నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్తున్న ఉద్యోగులు (ఇన్‌సెట్) కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విన్నవిస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యలను పరిష్కారించాలంటూ విద్యుత్ ఉద్యోగులు కదంతొక్కారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అమూల్ డెయిరీ వద్దకు వందలాది మంది ఉద్యోగులు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేసుకుంటూ కదిలారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా జేఏసీ నాయకులు మురళీకృష్ణ, వివేకానందరెడ్డి, యజ్ఞేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్పత్రిలో వైద్యఖర్చులకు రూ.లక్షలు ఖర్చువుతోందన్నారు. కానీ మెడికల్ బిల్లులు 60 శాతం కూడా కవర్ కావడం లేదన్నారు. మొత్తం వైద్యఖర్చులు చెల్లించే విధంగా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉండే నాలుగు డీఏ బకాయిలను విడుదల చేయాలని, 1999–2004 మధ్య ఉద్యోగంలో చేరినవారికి ఈపీఎఫ్ పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్–2 ఉద్యోగులను విద్యుత్‌శాఖలో విలీనం చేసి, జీతాలు పెంచాలన్నారు. డిప్లొమా చేసిన ఓఅండ్‌ఎం ఉద్యోగులకు పదోన్నతిలో అవకాశం కల్పించాలన్నారు. లైన్‌మెన్లకు లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా, సబ్‌ఇంజినీర్లను ఏఈగా, ఏఈలకు డీఈ, ఈఈలుగా అవకాశం కల్పించాలన్నారు. నాయకులు బద్రి, బాబు, బాలాజీ, జాఫర్, రమణ, హేమచంద్ర, వరదరాజులు, గోవిందు, అక్బర్, నాగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండయ్యా!

- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు క్యూ కట్టిన ప్రజలు
- వివిధ సమస్యలపై 348 వినతులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : 'అయ్యా.. సమస్యలు పరిష్కరించడయ్యా' అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 348 అర్జీలు అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను ఆయా శాఖల అధికారులు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మోహన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికార బలంతో కేసులు పెట్టిస్తున్నారు



కేసులు పెట్టిస్తున్నారని ధర్నా చేస్తున్న పాస్టర్లు

అధికార బలంతో దౌర్జన్యంగా కేసులు పెట్టిస్తున్నారని నగరికి చెందిన హోసన్న చర్చి పాస్టర్‌లు ఆరోపించారు. తమది ఎలాంటి తప్పు లేకున్నా కేసులు పెట్టి వేధించడం దారణమన్నారు. నగరిలో హోసన్న చర్చి భవన నిర్మాణాన్ని తమ క్రిస్టియాని టీకి చెందిన వ్యక్తే అడ్డుపడుతున్నారని ఆవేదన చెందారు. అధికారబలంతో కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కూటమి ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నం సురేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది రెడ్డి కులస్థులు ఉండగా అందులో 80 శాతం మంది పేదలున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. సంఘం సభ్యులు దామోదరరెడ్డి, దేవరాజులురెడ్డి, ధనంజయులురెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ బంగారుపాళ్యం మండలంలో దారి, కాలువ సమస్య పరిష్కారించాలని ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే పరిష్కరించకుండానే పరిష్కారం అయిపోయినట్లు అధికారులు చెప్పడం దారుణమన్నారు. అలాగే అనేక మండలాల్లో ఇదే దుస్థితి ఉందన్నారు. రాత్రికి, రాత్రే భూములు ఆక్రమించేస్తున్నారని ఆరోపించారు. గంగవరం మండలంలో మునెమ్మ అనే మహిళ రెవెన్యూ అధికారుల అలసత్వానికి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించడం బాధాకరమన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాడ గంగరాజు


దివ్యాంగులకు బ్యాటరీ సైకిల్ ఇవ్వడం లేదు



తండ్రిని ట్రై సైకిల్‌లో తోసుకెళ్తున్న జోత్స్న

ఎన్ని సార్లు తిరుగుతున్నా బ్యాటరీ సైకిల్ ఇవ్వడం లేదని పెనుమూరు మండలం, చిన్నకలికిరికి చెందిన దివ్యాంగుడు మణి వాపోయారు. చిన్నప్పుడు తనకు ప్రమాదవశాత్తు కాలు పోయిందన్నారు. పలు మార్లు అధికారులకు అర్జీ ఇచ్చి బ్యాటరీ సైకిల్ ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆయన కుమార్తె జోత్స్న ట్రైసైకిల్ పై కూర్చోబెట్టి తోసుకెళ్లి కలెక్టర్‌కు అర్జీ అందజేసింది.

యాదమరి ఆదర్శంగా నిలవాలి



అవగాహన కల్పిస్తున్న పీడీ శ్రీదేవి

యాదమరి: మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా యాదమరి చిత్తూరు జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. సోమవారం ఆమె ఎండీఎంఎల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అతిగారిపల్లి, పెరియంబాడి గ్రామాల్లోని సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సంఘ చెల్లింపులు పారదర్శకత కోసమే ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వెల్లడించారు. అందులో భాగంగానే మండలంలోని పెరియంబాడి, అతిగారిపల్లి, 14కండ్రిగ, మోర్థానపల్లి, తెల్లరాళ్లపల్లి–2ఏ గ్రామ సమైఖ్య సంఘాలలో అమలు చేస్తున్నామన్నారు. ప్రతి పది సంఘాలకు ఒక ఈ–నారీని గుర్తించి వారి ద్వారా సంఘం యొక్క లావాదేవీలు తెలుసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

తమిళనాడుకు 'చిత్తూరు లాటరీ'

చిత్తూరు అర్బన్: చిత్తూరులో నిర్వహిస్తున్న నిషేధిత లాటరీ టికెట్ల విక్రయాలు ఇప్పటికే జిల్లా సరిహద్దులు దాటి.. విజయవాడకు వరకు చేరాయి. తాజాగా ఈ లాటరీ టికెట్లను తమిళనాడుకు సైతం పంపుతుండడంతో అక్కడి పోలీసులు చిత్తూరు నగరంపై దృష్టి పెట్టారు. ఈ మేరకు తిరువణ్ణామలై పోలీసులు రెండు రోజుల క్రితం అక్కడ లాటరీలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని విచారించారు. తనకు చిత్తూరుకు చెందిన వ్యక్తి లాటరీ టికెట్లు సరఫరా చేస్తున్నాడని సమాచారం ఇచ్చాడు. దీంతో చిత్తూరుకు చెందిన ఓ పంపిణీ దారుడిని తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సచివాలయంలో ప్రింటర్ చోరీ

వెదురుకుప్పం : మండలంలోని తిరుమలయ్య పల్లె సచివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రింటర్‌ను చోరీ చేశారు. కార్యదర్శి సోమ వారం ఈమేరకు వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సచివాలయ తలుపులకు వేసిన తాళాలను పగులగొట్టి ప్రింటర్‌ను అపహరించినట్లు పేర్కొన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఇదే విధంగా కొమరగుంట, బ్రాహ్మణపల్లె సచివాలయాల్లో ప్రింటర్లు అపహరణకు గురవడం గమనార్హం.

గ్రావెల్ తరలింపుపై ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు, నేతలు

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలోని గుట్టను తవ్వి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఘటనపై సోమవారం గ్రామస్తులతో కలిసి సీపీఎం, టీడీపీ నేతలు ధర్నాకు దిగారు. ఎర్రమట్టిని టిప్పర్లకు లోడ్ చేస్తున్న ప్రాంతంలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలకు అనుమతిస్తున్నారని మండిపడ్డారు. సుమారు ఐదు నెలలుగా మట్టి యథేచ్ఛగా తమిళనాడుకు తరలిపోతున్నప్పటికీ ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ అరుణకుమారి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తుల ఫిర్యాదును తీసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మట్టి తరలింపును అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి రూరల్: శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)లో వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వర్సిటీ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బీఈడీ అడిషనల్ మెథడాలజీ, ఎంకామ్, ఎంఏ తెలుగు, ఎంఏ సంగీతం, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన), వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

అక్రమ కేసులు కక్ష సాధింపే



అధికారం చేపట్టిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, దాడులు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే పత్రికల గొంతు నొక్కి అక్రమ కేసులు బనాయించడం కక్ష సాధింపే. ప్రభుత్వం చేస్తున్న అరచాకాలను వెలుగులోకి తెచ్చేలా వార్తలు రాస్తే వారిపై కక్ష సాధింపు చర్యగా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవస్థలను చేతుల్లోకి తీసుకునేలా వ్యవహరించడం, సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు విలేకర్లపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడమే.

– జీ శశికుమార్, గూడూరు నియోజకవర్గ కార్యదర్శి, సీపీఐ



కేసులు పెట్టడం బాధాకరం



కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దాడులు, అరచకాలను వెలుగులోకి తీసుకుని వచ్చిన మీడియాపై కేసులు బనాయించడం బాధాకరం. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ప్రజా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే సాధనం మీడియా. అలాంటి మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడం శోచనీయం.

– సీహెచ్ ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం, తిరుపతి జిల్లా ప్రదాన కార్యదర్శి

అమ్మా..గంగమ్మా!

కోరిన కోర్కెలు తీర్చే అమ్మ బోయకొండ గంగమ్మ

- నేటి నుంచి దసరా మహోత్సవాలు
- రూ.5,116 చెల్లిస్తే ఉభయదారులుగా పాల్గొనొచ్చు

బోయకొండ(చౌడేపల్లె): దసరా మహోత్సవాలకు బోయకొండ గంగమ్మ ఆలయం ముస్తాబైంది. మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ గురువారం వరకు పది రోజులపాటు అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు బోయకొండ ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా పేరొందిన బోయకొండ అమ్మకు కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పవిత్రమైన పుష్కరిణి తీర్థం

అమ్మవారి ఆలయ సమీపాన ఉన్న పుష్కరిణిలోని నీరు అతి పవిత్రమైన తీర్థంగా భక్తులు భావిస్తారు. ఈ తీర్థాన్ని సేవించడం వల్ల సకల రోగాలు మాయమవుతాయని, పంటలపై తీర్థాన్ని చిలకరిస్తే చీడ, పీడలు తొలగుతాయని భక్తుల నమ్మకం. దుష్టసంబంధమైన గాలి భయాలు దూరమవుతాయని భక్తుల విశ్వాసం. రూ.20కే బాటిల్‌తో సహా తీర్థాన్ని భక్తులకు అందిస్తున్నారు.

పుష్ప మహిమ

భక్తులు తమ కోరికలు నేరవేరుతాయో లేదో తెలుసుకునేందుకు మ్మవారి శిరస్సుపై మూడు పుష్పాలుంచి కోరికలను మనస్సులో స్మరించమంటారు. అమ్మవారు కుడివైపున పుష్పం పడితే కోరికలు తీరుతాయని, ఎడమవైపు పడితే ఆలశ్యంగా నెరవేరుతాయని, మధ్యలో పడితే తటస్థంగా భావించవచ్చని భక్తులు విశ్వసిస్తుంటారు.

రవాణా మార్గాలు

చౌడేపల్లె నుంచి బోయకొండ ఆలయం వద్దకు 12 కి.మీ దూరం ఉంది. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. అలాగే పుంగనూరు నుంచి బోయకొండకు 14 కి.మీ దూరం. మదనపల్లె నుంచి 16 కి.మీ. ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఇక్కడి నుంచే కాకుండా బెంగళూరు నుంచి కూడా బోయకొండకు ప్రత్యేకంగా కర్ణాటక ఆర్టీసీ బస్సు సర్వీసులున్నాయి. గతంలో గతుకుల రోడ్లలతో భక్తులు ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడంతో ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంది. కొండ కింద నుంచి ఆలయం వరకు ప్రయివేటు వాహనాల ద్వారా ప్రయాణం చేయొచ్చు.

ప్రత్యేక సౌకర్యాలు

దసరా మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. దసరా మహోత్సవాల్లో పాల్గొన దలచిన ఉభయదారులు రూ.5,116 చెల్లించాల్సి ఉంటుందని ఈఓ పేర్కొన్నారు. దుర్గా సప్తశతి చండీహోమం (పౌర్ణమి రోజున) పాల్గొనే ఉభయదారులు రూ.2,116, శ్రీఫ్రుఫలదాయిని పూజలో పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించొచ్చు. రూ.వెయ్యి చెల్లించి వేద ఆశీర్వాదం టికెట్టు కొనుగోలు చేసిన ఇద్దరు భక్తులకు దర్శనంతో పాటు వేద ఆశీర్వాదం పొందవచ్చు. ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఊంజల్ సేవ, అభిషేకం, గణపతి, చండీహోమాలు నిర్వహించేలా ఏర్పాట్లు సినట్టు ఈఓ తెలిపారు. ఉభయదారులకు అమ్మవారి ప్రసాదం, పవిత్రమైన శేషవస్త్రం, చీరతో పాటు రవిక పీసు, అమ్మవారి కుంకుమ, గాజులు, అమ్మవారి మెమెంటో ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



బోయకొండ గంగమ్మతల్లి



బోయకొండ ఆలయ ముఖచిత్రం

దశావతారాలు



ఈ నెల 23 నుంచి అమ్మవారికి పది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు చేపట్టనున్నారు. 23న శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 24న శ్రీపార్వతీదేవిగా, 25న శ్రీఅన్నపూర్ణాదేవి, 26న శ్రీధనలక్ష్మీదేవిగా, 27న శ్రీశాఖాంబరీ దేవిగా, 28న శ్రీమహాచండీదేవిగా, 29న శ్రీసరస్వతీదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబరు 1న శ్రీమహిషాసురమర్దినిగా, 2న శ్రీరాజ రాజేశ్వరిదేవిగా బోయకొండ గంగమ్మ భక్తులను కటాక్షించనున్నారు.

దర్భ చాప, తాడు ఊరేగింపు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భచాప, తాడును టీటీడీ అటవీ విభాగం కార్యాలయం నుంచి సోమవారం డీఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణం కార్యక్రమంలో వీటిని ఉపయోగిస్తారు.

ధ్వజారోహణానికి దర్భ చాప, తాడు కీలకం

బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం పైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టీటీడీ అటవీ శాఖ 10 రోజుల ముందు నుంచే కసరత్తు చేస్తోంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఇందుకోసం ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణు దర్భను టీటీడీ అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాప, 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడు సిద్ధం చేశారు.

దర్భ వైశిష్ట్యం

వేదోక్త శాస్త్రాల్లో దర్భ (కుశ గడ్డి) అత్యంత పవిత్రమైనదిగా పేర్కొన్నారు. రుగ్వేదంలో ''కుశాః పవిత్రా భవతు'' అని దర్భను శుద్ధికరమైనదిగా చెప్పగా, యజుర్వేదంలో దర్భాసనంపై కూర్చొని చేసే ఉపాసన శ్రేష్ఠ ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా చూసినా ఇందులో సిలికా అధికంగా ఉండడంతో వాతావరణ శుద్ధి, సూక్ష్మక్రిముల నిర్మూలన జరుగుతుంది. కాబట్టి వేదోక్త కర్మల్లో దర్భ వినియోగం, దైవిక వరమని భావిస్తారు.

ఉచితం.. ఊసే లేదు!



ఈఈకి వినత పత్రం అందజేస్తున్న కార్మిక నేతలు

- విద్యుత్ బిల్లులు చెల్లించలేమంటున్న పవర్‌లూమ్స్ కార్మికులు

పుత్తూరు: ఉచిత విద్యుత్ అందిస్తామని కేబినెట్‌లో తీర్మానించి, జీఓ విడుదల చేసినప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని పవర్‌లూమ్స్ కార్మికులు మండిపడ్డారు. సోమవారం స్థానిక గేట్‌పుత్తూరులో వందలాది మంది కార్మికులు ఆందోళను దిగారు. ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ ఆశీర్వాదానికి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారం కోసం స్థానిక వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలు ఏకమై ప్రభుత్వాన్ని నిలదీయడం విశేషం. కార్మిక నాయకులు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నుంచి పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేయడానికి ఈఏడాది మార్చి 16వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. అనంతరం ఆగస్టు 7వ తేదీ నుంచి ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నట్లు జీఓ విడుదల చేశారని తెలిపారు. అయితే ఆగస్టులోనూ తాము బిల్లులు చెల్లించామని, ఈ సెప్టెంబర్‌లోనూ మళ్లీ యధావిధిగా విద్యుత్ బిల్లులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము బిల్లులు చెల్లించే పరిస్థితిలో లేమని తేల్చి చెప్పారు. బిల్లులు చెల్లించాలని నిర్బంధిస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. దీనిపై ఈఈ ఆశీర్వాదం మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్మిక సంఘాల నేతలు శంకర్, పొన్నుస్వామి, సురేష్, నాగప్ప, జ్యోతి, సెల్వం, శివ, ఇళయరాజ, పాండియన్, కన్నప్ప, కన్నియప్పన్, అన్నామలై, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ట బందోబస్తు

- పద్మావతీఅమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

చంద్రగిరి: భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 24, 25వ తేదీల్లో తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం రానున్నారు. తిరుమల శ్రీవారితో పాటు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆయన దర్శించుకోనున్నారు. ఈ క్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ ఉన్నతాధికారులు తిరుచానూరుకు చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి రానున్న నేపథ్యంలో కల్పించాల్సిన ప్రత్యేక ఏర్పాట్లకు సంబంధించి ఆలయ మాడ వీధులు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై ఏర్పాటు చేసిన ట్రయల్ రన్‌ను పరిశీలించి, అక్కడ నుంచి తిరుమలకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా మరగదాంబికా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ది వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన మరగదాంబిక దేవస్థానంలో సోమవారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉయదం అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీని పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధరాణి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): స్వస్థ్ నారీని పకడ్బందీగా నిర్వర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. సాక్షి దినపత్రికలో ఈనెల 19వ తేదీన స్వస్థ్ నారీ వెతలు పేరుతో వార్త వెలువడింది. దీనిపై స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ సోమవారం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమ అమలు తీరుపై చర్చించారు. పీహెచ్‌సీలోని డాక్టర్లు, సిబ్బంది స్థానికంగానే ఉండాలన్నారు. స్వస్థ్ నారీ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జరిపించాలన్నారు. 18 ఏళ్లు పైబడి, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి కచ్చితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆబా ఐడీ నమోదు చేయాలన్నారు. బాలింతలకు రక్తహీనత పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. అనుమానిత క్యాన్సర్ కేసులను గుర్తించాలన్నారు. అలాగే టీబీ పరీక్షలు చేసి నిర్ధారణ అయినా కేసులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. మాతా శిశు సంరక్షణ సేవలను శనివారానికి వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. డాక్టర్లు ప్రతిరోజూ జరిగే స్వస్థ్ నారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట ప్రసాద్, హనుమంతరావు, ప్రవీణ, అనూష, నవీన్‌తేజ్ రాయ్, అర్పిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి గొడుగులకు ఘన స్వాగతం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా స్వామివారికి సమర్పించనున్న గొడుగులు సోమవారం తిరుపతికి చేరుకున్న సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలికారు. చెన్నైకి చెందిన ఫోవైసీ అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్టు నిర్వాహకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పాదయాత్రగా తిరుపతిలోని శ్రీకోదండరామాలయం వద్దకు చేరుకున్న 8 శ్రీవారి గొడుగులకు భక్తులు పూజలు చేశారు. అనంతరం గొడుగులు తిరుమలకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పసుపులేటి హరిప్రసాద్, రంగస్థలి చైర్మన్ గోపినాథ్‌రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, నవీన్ రెడ్డి బాబు, హనుమంతరావు, సుబ్బరామయ్య, పానగంట భాస్కర్ పాల్గొన్నారు.

పంటలు ధ్వంసం



చల్లావారిపల్లెలో ధ్వంసమైన టమాట పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం తెల్లవారు జామున చల్లావారిపల్లె గ్రామంలో పంట పొలాలపై పడి నాశనం చేశాయి. బాలు పొలంలో టమాట పంటను తొక్కి నాశనం చేయడం ఇది రెండో సారి. అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంకు చెందిన వరి పంటను తొక్కేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు

సంఘమిత్ర చేతి వాటం

- రూ.4.9 లక్షలు స్వాహా



ఆందోళన వ్యక్తం చేస్తున్న సందరాంగిణిపల్లె మహిళలు

వెదురుకుప్పం: ఓ సంఘమిత్ర చేతి వాటాన్ని ప్రదర్శించాడు. గ్రామ సమైఖ్య(వీఓ) ద్వారా పేదలకు అందించే రుణాల్లో గోల్‌మాల్ చేసి రూ.4 లక్షలకుపైగా స్వాహా చేశాడు. ఈ ఘటన సోమవారం వెదురుకుప్పం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల కథనం...మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ, సుందరాంగిణిపల్లె ఎస్సీ కాలనీలో సాయి వీఓ పరిధిలో ధనలక్ష్మి, వినాయక, తరుకాణమ్మ, కనకదుర్గ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. 2014లో పీఓపీ కింద ఎస్సీ, ఎస్టీ మహిళలు ఒక్కో సభ్యురాలికి రూ.40 వేల చొప్పున రుణాలు మంజూరు చేశారు. సాయి వీఓ పరిధిలోని ధనలక్ష్మి, వినాయక, తరుకాణమ్మ, కనకదుర్గ స్వయం సహాయక సంఘాల్లోని కొంత మందికి ఒక్కో మహిళకు రూ.40 వేల చొప్పున రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో సంఘమిత్రగా ఉన్న సుబ్రమణ్యం రెడ్డి తన చేతి వాటాన్ని ప్రదర్శించారు. నెలనెలా సభ్యుల వద్ద వసూలు చేసి బ్యాంకులో జమచేస్తానని నమ్మబలికి రుణాలు స్వాహా చేశాడు. 18 మంది నుంచి రుణాల చెల్లింపు పేరిట వసూలు చేసిన మొత్తాన్ని తన అవరాలకు వాడుకునేశాడు. ధనలక్ష్మి సంఘం నుంచి రూ.44,463, వినాయక సంఘం నుంచి రూ.1,31,850, తురకాణమ్మ సంఘం నుంచి రూ.1,54,449, కనకదుర్గ సంఘం నుంచి రూ.1,59,429 చొప్పున మొత్తం రూ. 4,90,191 వసూలు చేశాడు. తాజాగా స్వయం సహాయక రుణాల కోసం బ్యాంకు వద్ద కు సంఘ సభ్యులు వెళ్లడంతో అసలు విషయం బహిర్గతమైంది. గతంలో తీసుకున్న రుణాలను చెల్లించలేదని చెప్పడంతో అవాక్కయ్యారు. దీంతో సోమవారం వెదురుకుప్పంలో సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలంటూ వెదురుకుప్పం ఎస్ఐ, వెలుగు ఏపీఎం పరశురామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

సంఘమిత్ర పై విచారణ

సంఘమిత్ర సుబ్రమణ్యం రెడ్డిపై మండల సమైఖ్య కమిటీ ద్వారా విచారణ చేపట్టినట్టు ఏపీఎం పరశురామిరెడ్డి తెలిపారు. సుబ్రమణ్యంరెడ్డి వసూలు చేసిన నగదును తానే వాడుకున్నట్లు ఒప్పుకుని సభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బును ఒక నెలలోపు తిరిగి చెల్లిస్తానని వెలుగు కార్యాలయంలో రాత పూర్వకంగా రాసిచ్చారు. కాగా సుబ్రమణ్యంరెడ్డి పై జిల్లా అధికారులకు నివేదికలు అందించి తగు చర్యలు తీసుకుంటామని ఏపీఎ సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు.